రైతుకు మిర్చి మంట



కొత్తపట్నం మండలంలో సాగుచేసిన పచ్చిమిర్చి పంట



లారీకి లోడు చేసిన పచ్చిమిర్చి బస్తాలు

- భారీగా పడిపోయిన పచ్చిమిర్చి ధరలు
- ఖర్చులకు కూడా రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు

కొత్తపట్నం: పచ్చిమిర్చి పంట ఆయా రైతులకు మంట పుట్టిస్తోంది. పంట ధరలు అమాంతం పడిపోవడంతో వచ్చే ఆదాయం ఖర్చులకు కూడా సరిపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యానవన పంటల్లో పచ్చిమిర్చి పంట ప్రధానమైనది. ప్రతిరోజూ వంటకాల్లో వాడుకోవాల్సి ఉన్నప్పటికీ.. పచ్చిమిర్చి ధర మాత్రం దిగజారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో భారీగా నష్టపోతున్నారు. ఒకవైపు ప్రకృతి అనుకూలించక, మరోవైపు ధర పడిపోవడంతో జిల్లాలో పచ్చిమిర్చి రైతుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. దళారులు సిండికేట్‌గా మారి పంటను తక్కువ ధరకు కాజేసి అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దిగాలు చెందుతున్నారు. విత్తన దశలో పంట ధరలు అధికంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు మిర్చి పంటపై ఆసక్తి చూపారు. జిల్లాలోని తీర ప్రాంత మండలమైన కొత్తపట్నంతో పాటు రాచర్ల, గిద్దలూరులో ఎక్కువగా పచ్చిమిర్చి పంట సాగు చేశారు. ఇసుక నేలలు పచ్చిమిర్చి సాగుకు అనుకూలంగా ఉంటాయి. దీంతో కొత్తపట్నం మండలంలో ఏటా అధికంగా పచ్చిమిర్చి సాగుబడి చేస్తారు. రెండేళ్ల నుంచి మిర్చి పంట సాగుచేసిన రైతులు అధిక లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ఏడాది కూడా లాభాలు వస్తాయని ఆశించి పచ్చిమిర్చి సాగుచేసిన రైతులు ఒక్కసారిగా ధరలు గణనీయంగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సాగు పెరిగి.. ధర తరిగి...

ఈ ఏడాది పచ్చిమిర్చి పంట సాగు విస్తీర్ణం పెరిగింది. దాంతో పాటు ఒకేసారి దిగుబడి రావడంతో ధర గణనీయంగా తగ్గింది. పచ్చిమిర్చి నిల్వ చేసుకోవడానికి వసతులు లేకపోవడమే ధర తగ్గడానికి కారణమని రైతులు అంటున్నారు. గతేడాది జిల్లాలో సుమారు 2.5 వేల ఎకరాల్లోనే పచ్చిమిర్చి సాగుచేశారు. ఈ ఏడాది 3 వేల ఎకరాలకు పెంచి సాగు చేస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకేసారి ఉత్పత్తి రావడం వలన ధర తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. ఫెంగల్ తుఫాన్ వల్ల కూడా మిర్చి పంట కొంత దెబ్బతింది. వర్షాలు అధికంగా కురవడం వలన కాండం దెబ్బతిని కొంత కుళ్లిపోయింది.

ఒకేసారి పంట దిగుమతి కావడంతో తగ్గిన ధర...

ఇతర రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, బెంగళూరు, చెన్నైలకు మన జిల్లా నుంచి పచ్చిమిర్చి ఎగుమతి చేస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారస్తులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తారు. ప్రతిరోజూ మన జిల్లా నుంచి వెయ్యి టన్నుల పచ్చిమిర్చి ఎగుమతి అవుతున్నట్లు సమాచారం. ఈసారి అన్ని ఏరియాల నుంచి ఒకేసారి దిగుమతి రావడం వలన ధర తగ్గినట్లు తెలుస్తోంది. వ్యాపారస్తులు కొన్ని ఏరియాలలో పెట్టుబడులు కూడా పెట్టి రైతులతో మిర్చి పంటను సాగు చేయిస్తారు. కానీ, ఈసారి ధర దిగజారడంతో పెట్టుబడిదారులు కూడా ముందుకు రావడంలేదు. దీంతో కొత్తగా మిర్చి పంట వేయడానికి రైతులు ఆసక్తి చూపడంలేదు.

భారీగా తగ్గిన ధర...

ఈ ఏడాది పచ్చిమిర్చి పంట ధర పూర్తిగా తగ్గిపోయింది. రెండేళ్ల నుంచి క్వింటా ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పలికింది. ఇదే విధంగా ధర ఉంటుందని ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ఎక్కువగా ఇసుక పొలాల్లో వేరుశనగ పంట పండిస్తారు. మిర్చి పంటపై ఎక్కువ లాభాలు వస్తున్నాయనే ఉద్దేశంతో ఈసారి ఎక్కువ మంది రైతులు మిర్చి పంటను ఎంచుకుని సాగు చేశారు. ఎకరాకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నీరు పెట్టేవాడికి జీతం కలుపుకుని రూ.1.40 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు ఖర్చు చేశారు. ఎకరాకు 2 టన్నుల నుంచి రెండున్నర టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఒక టన్ను ధర రూ.50 వేల నుంచి రూ.55 వేలు పలుకుతోంది. దానిప్రకారం ఎకరాకు సుమారు రూ.30 వేలు నష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు. క్వింటా మిర్చి కోత కోస్తే రూ.600 కూలి ఇవ్వాల్సిన వస్తోంది. భారీగా నష్టం రావడంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గిడ్డంగి సౌకర్యాలు కల్పించి ధర తక్కువ ఉన్నప్పుడు నిల్వ చేసుకుని ఎక్కువ ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



నేను 2 ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు చేశా. ఎకరానికి రూ.లక్ష ఖర్చయింది. క్వింటా ధర ఇప్పుడు రూ.1,800 మాత్రమే పలుకుతోంది. ఇదే కొనసాగితే కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. పచ్చిమిర్చిని నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు ఉంటే ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం గిడ్డంగులకు అవకాశం కల్పించాలని కోరుకుంటున్నా.

– తాతా వెంకటేశ్వరరావు, గమ్మళ్లపాలెం

ధర ఇంతలా తగ్గుతుందని ఊహించలేదు



నేను రెండు ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు చేశా. ఊహించని రీతిలో ధర తగ్గిపోయింది. దీనికి తోడు వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర తగ్గించారు. పైన మార్కెట్ ఉన్నాగానీ.. వ్యాపారస్తులు బయట పెట్టకుండా ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పచ్చిమిర్చి రైతులకు న్యాయం చేయాలి.

– బ్రహ్మయ్య, గమ్మళ్లపాలెం

క్లుప్తంగా

11 నుంచి మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఈ నెల 11, 12, 13 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.2,116, రెండో బహుమతిగా రూ.1016 అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి టీంకు ఇద్దరు మాత్రమే ఉండాలన్నారు. ఆసక్తి గల వారు 83281 50782, 94406 16183 సెల్ నంబర్లను సంప్రదించి ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి రూరల్: మండలంలోని మర్రిచెట్లపాలెం, ఆర్‌ఎల్ పురం సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఆర్.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పని నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. బూదవాడ, ఆర్.ఎల్.పురం పరిశ్రమలకు, పులికొండ, మైలవరం, బూసరపల్లి, చినరావిపాడు, మర్రిచెట్లపాలెం, బూదవాడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సోషల్ ఆడిట్ తప్పులు సరిదిద్దండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాల మహాసభ నాయకులు, ఉద్యోగులు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన సోషల్ ఆడిట్‌లోని తప్పులను సరిదిద్దాలని మాల మహాసభ నాయకులు, మాల ఉద్యోగుల సంఘ నాయకులు శనివారం తహసీల్దార్ బ్రహ్మయ్యను కలిసి వినతిపత్రం అందించారు. సోషల్ ఆడిట్‌లో మాలలను క్రిస్టియన్‌లుగా, మాదిగలుగా, ఆర్య మాలలుగా నమోదు చేస్తున్నారని తెలిపారు. మాలలకు అన్యాయం జరగకుండా సోషల్ ఆడిట్‌లో తప్పులు సరిదిద్దాలని మాల మహాసభ నాయకులు, ఉద్యోగులు బండ్ల డేవిడ్, వేమా బాలకోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు తహసీల్దార్‌కు విన్నవించారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



కొత్తపట్నంలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో-2 పద్మావతి, హెచ్‌ఎం శ్రీదేవి

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖాధికారి పద్మావతి, హెచ్‌ఎం మన్నం శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం ద్వారా డ్రాపవుట్స్ సంఖ్య తగ్గుతుందన్నారు. పాఠశాలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో 44 మందికి అదనంగా భోజనం తయారు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ మన్నం శ్రీదేవి హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు భోజనం ప్లేట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, సీఆర్ శ్రీనివాస్‌రావు, హైస్కూల్ ప్లస్ టీచర్ సురేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని సంతనూతలపాడు ఎంఈఓ డి.వెంకారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డీవీఎల్ నరసింహారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ టి.అంజలి, ఉపాధ్యాయుడు ఓబుల్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు (మద్దిపాడు): నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ నాగలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్, ఎంఈఓ రవి, ప్రిన్సిపాల్, నాయకులు పాల్గొన్నారు.

నేడు దాచూరి స్మారక మెడికల్ క్యాంపు

ఒంగోలు టౌన్: ప్రతి రెండు నెలలకోసారి జిల్లా కేంద్రమైన ఒంగోలులో నిర్వహించే దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపు ఆదివారం ఏర్పాటు చేయనున్నట్లు కన్వీనర్ మాదాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు బస్టాండు సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ మెడికల్ క్యాంపు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు ఈ క్యాంపులో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారని వివరించారు. ఇప్పటికే ఈ శిబిరంలో వైద్య చికిత్స పొందుతున్న వారు పాత రక్త పరీక్షల రిపోర్టులతో పాటుగా ప్రిస్క్రిప్షన్, ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు.

పేరం లక్ష్మికి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు

చీమకుర్తి: గిరిజన సంఘ రాష్ట్ర నాయకుడు పేరం శ్రీనివాసరావు మాతృమూర్తి పేరం లక్ష్మి సంతాప సభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలోని పేరం శ్రీనివాసరావు నివాసం వద్ద జరిగిన సంతాప సభలో ఆదివాసి ఉద్యోగుల సంఘ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, కేఎస్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు దుడ్డు వెంకట్రావు, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు పేరం సత్యం, ఎస్‌ఎం ధర్మ, పిన్నిక శ్రీనివాసరావు, కొత్రపు రాఘవ, స్థానిక ప్రజాసంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఎస్సీ వర్గీకరణ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు, కౌన్సిలర్లు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణ కమిషనర్ సోమవారం ఒంగోలు వస్తున్న సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు వినతిపత్రాలు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు, కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. శనివారం చీమకుర్తి క్రిస్టియన్‌పాలెంలోని సామాజిక కేంద్రంలో ఎంఈఎఫ్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించేందుకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బొంతా ఏసుదాస్, నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు పిచ్చిరాజు, చిరంజీవి, కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, జే యాకోబు, స్థానికులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో చీమకుర్తి విద్యార్థినుల ప్రతిభ



డీఈఓ చేతుల మీదుగా మెమోంటో అందుకుంటున్న విద్యార్థినులు

చీమకుర్తి: జిల్లాస్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సుమిత్ర, లావణ్య తృతీయ బహుమతి గెలుచుకున్నారు. బయోప్లాస్టిక్స్ ఇన్ అవర్ డెయిలీ లైఫ్ అనే అంశంపై వీరు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌కు జిల్లా స్థాయిలో మూడో బహుమతి రావడం ఆనందంగా ఉందని హెచ్‌ఎం పీ సుబ్రహ్మణ్యం శనివారం విద్యార్థినులను అభినందించారు. డీఈఓ చేతుల మీదుగా విద్యార్థినులకు మెమోంటో, ప్రశంసపత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన ఎస్‌కే పీరా అహ్మద్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ సదస్సుకు 95 అర్జీలు



మోటుమాలలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 95 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం 20, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ల కోసం 4, మ్యుటేషన్ కోసం 11, ఆన్‌లైన్ సబ్‌డివిజన్ కోసం 34, ఎఫ్ లైన్‌కు 24, ఈడబ్ల్యూఎస్ కోసం 2 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అక్కడికక్కడే కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు 4, క్యాస్ట్, ఇన్‌కం కలిపి 20, ఈడబ్ల్యూఎస్ 2 తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వరప్రసాద్‌రావు, పురిణి శ్రీను, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పి.తక్కెళ్లపాడులో...

సంతనూతలపాడు: మండలంలోని పి.తక్కెళ్లపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. స్థానిక సర్పంచ్ పోకూరి సుజాత అధ్యక్షత వహించగా, రైతుల నుంచి రెండు అర్జీలు వచ్చాయి. ఒకటి ఆన్లైన్లో సబ్ డివిజన్, మరొకటి పట్టాదారు పాస్ పుస్తకం కోసం వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. వీఆర్వో షేక్ ముంతాజ్, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, సర్వేయర్ ఎం.బ్రహ్మయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఐ.నాగేశ్వరరావు, మండల రెవెన్యూ సదస్సుల ఎండోమెంట్ ఇన్‌చార్జి మద్దినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బండారు లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

తెలుగులో ఉత్తర్వులను స్వాగతించిన రచయితలు

ఒంగోలు మెట్రో: ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి తెలుగులో కూడా ఉత్తర్వులు ఇవ్వాలనే నిర్ణయంపై కళామిత్ర మండలి, నరసం, నాగభైరవ సంస్థల ప్రతినిధులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులను ఇక నుంచి తెలుగులో కూడా ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయిస్తూ ఆదేశాలివ్వడంపై కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, ప్రముఖ కవి యు.వి.రత్నం, కళాకారుల పక్షాన మిడసల మల్లికార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, కనమాల రాఘవులు, గుంటూరు సత్యనారాయణ, బీరం అరుణ, ఎం.సూర్యకుమారి అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు, తెలుగు భాషాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో తొలగించిన తెలుగును మళ్లీ ప్రవేశపెట్టాలని, రాష్ట్రమంతటా అన్ని దుకాణాలపై కూడా తెలుగులో ఫలకాలు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, సాహిత్య సాంస్కృతిక సంస్థలు, కవులు, కళాకారులను ఆదుకోవాలని కోరారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి



యూటీఎఫ్ జిల్లా జాత ప్రారంభిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడ నగరంలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తారని, వాటిని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి పతాక జాతాలు బయలుదేరి కాకినాడ నగరం చేరుకుంటాయని తెలిపారు. శనివారం సాయంత్రం యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండా ఊపి ప్రకాశం జిల్లా జాతాను ప్రారంభించారు. కాకినాడ స్వర్ణోత్సవ మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి యూటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభల్లో ప్రభుత్వం విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యల మీద చర్చించి, సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి వినతిపత్రాన్ని అందిస్తామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ 29 శాతం ప్రకటించాలని, పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సరెండర్ బకాయిలు, మెడికల్ బిల్ బకాయిలు, పీఎఫ్ లోన్ బకాయిలు, ఏపీజీఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. జిల్లా కోశాధికారి ఎస్.చిన్నస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమస్యల మీద ఒక ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురావాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పునరుద్ధరించాలని జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజసులోచన, జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, హరిబాబు, నరసింహారావు, నారాయణ, ఖాసింవలి, ఎ.తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మద్దిపాడు సచివాలయం ఆకస్మిక తనిఖీ

మద్దిపాడు: స్థానిక సచివాలయాన్ని జెడ్పీ సీఈవో బి.చిరంజీవి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీపీఎస్ ఈకేవైసీ, మిస్సింగ్ సిటిజన్, జియో ట్యాగింగ్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, సర్వేల గురించి గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా పనిచేస్తే ఇబ్బందులు పడతారని సిబ్బందిని హెచ్చరించారు. డీఏ వద్ద ఆన్‌లైన్లో పెండింగ్‌లో ఉన్న సర్వే వివరాలను పరిశీలించారు. సర్వే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వి.జ్యోతి, మద్దిపాడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామస్వామి ఉత్సవాలు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీ రోడ్డు గుర్రంవారివీధిలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో శనివారం ఉదయం వగల్పత్తు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12 మంది ఆళ్వార్లకు పరివట్టం కట్టి మర్యాద చేశారు. అనంతరం ముదలాయిరమ్ 200 పాశురాలు, పెరియ తిరుమొజి 200 పాశురాలతో సేవించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందజేశారు.

జెడ్పీ హైస్కూల్‌కు ప్రింటర్, జెరాక్స్ మిషన్ అందజేత

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని ముక్తినూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెంకట శివాజీ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాయపాటి వెంకటేశ్వర్లు హెచ్‌పీ ప్రింటర్, జెరాక్స్ మిషన్‌ను శనివారం హెచ్‌ఎం ఈదర దేవసేనకు అందజేశారు. దాత వెంకటేశ్వర్లుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

స్కౌట్ శిక్షణతో మార్పు

ఒంగోలు సిటీ: స్కౌట్ శిక్షణ కార్యక్రమం మీలో గుణాత్మకమైన మార్పు తీసుకొస్తుందని ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు విద్యార్థులతో అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న బేసిక్ కోర్స్ ఫర్ స్కౌట్స్ మాస్టర్స్ కార్యక్రమానికి శనివారం ఎంఈఓ హాజరై మాట్లాడారు. సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తన్నీరు బాలాజీ, రిసోర్సుపర్సన్లు డీఎల్ నారాయణ, బి.శివనాగిరెడ్డి, కేవీ శేషారావు, పి.వెంకటరావు, కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడి ఆరాధనతో సత్ఫలితాలు

ఒంగోలు మెట్రో: మనిషిలో ఉన్న అహంకారాన్ని, కామక్రోధాలను తొలగించిన నాడే భగవత్‌సాక్షాత్కారం లభిస్తుందని టీటీడీ ఆళ్వార్‌దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఉపన్యాసకుడు, స్వర్ణకంకణ గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ధనుర్మాసం సందర్భంగా శనివారం ఉదయం స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 20వ రోజు తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. పొన్నూరు పాల్గొని ప్రవచించారు. అండాళ్‌గోష్ఠి నిర్వాహకురాలు కుమారి, అర్చకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కళ్యాణోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ద్వసహస్ర శ్రీనివాస కళ్యాణ యాజ్ఞిక బ్రహ్మ వైఖానస ఆచార్య శ్రీమాన్ మురికిపూడి త్రినాథ్ చక్రవర్తి ఆచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి పూజాక్రతువులను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవ, దోమల సేవ, కొలుపు, ఎనిమిది గంటలకు సహస్రనామార్చన, నివేదన, పది గంటలకు స్నపన తిరుమంజనం, విశేష అలంకారం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస విశేష అనుగ్రహ హోమం, మధ్యాహ్నం పన్నెండు గంటలకు తిరుప్పావడ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం ఆరు గంటలకు తిరువీధి ఉత్సవం, శ్రీవారి కళ్యాణోత్సవాలను శోభాయమానంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామివారికి కైంకర్యం, ఏకాంత సేవ, నిత్యోత్సవాలు నిర్వహించారు. నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు జరిగే ఉదయాస్తమాన పూజా క్రతువులను తిలకించారు.

ద్విచక్ర వాహనం చోరీ

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన పిరకాల రామకృష్ణారెడ్డి తన ఇంట్లో ఒకపక్క ఉంచిన ద్విచక్రవాహనాన్ని శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీ చేశారు. దీంతో శనివారం కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు అయిన ప్రకాశంజిల్లా, ఒంగోలు పట్టణం, పెద్ద మసీదు వెనుకవైపు, మాషాప్ షా వీధి, డోరు నెం.47 - 1 - 52రు నివాసం, మట్టా చంద్రశేఖర్ గారి కుమారుడు వెంకట మణికంఠ సాయి, డోరు నెం. 23-033 - 154రు నివాసం, మట్టా సత్యనారాయణ గారి కుమారుడు శ్రావణ్ కుమార్, అనువార్లు మాకు యిచ్చిన సమాచారము మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. క్రింది షెడ్యూలు దాఖలాస్తి (1) శ్రీమతి వలివేటి అలివేలు మంగతాయారు, (2) శ్రీ తూనుగుంట శ్రీనివాసులు, (3) శ్రీమతి గుండ్లపల్లి తిరుమల, (4) శ్రీ తూనుగుంట రవికుమార్, (5) శ్రీమతి రామర్తి పద్మజ, (6) శ్రీమతి తూనుగుంట భవాని గార్ల స్వాధీనానుభవములో కలిగి నిర్వివాదముగా అనుభవించుచు వారి అవసరముల నిమిత్తం మా క్లయింట్లుకు విక్రయించుటకు ఖరారుపడి, మా క్లయింట్లు పేరుతో స్థిరాస్థి విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాసియున్నారు. క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి మా క్లయింట్లు విక్రయదారులు తండ్రిగారైన శ్రీ తూనుగుంట సుబ్బారావు గారి కుమారుడు వెంకటేశ్వర్లు గారి పేరున గల ఒరిజినల్ రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 1048/1967రు మరియు వెంకటేశ్వర్లు గారు వ్రాసిన వీలునామా దస్తావేజు నెం. 70/1989రు పోయినవి అని మా క్లయింట్లుకు తెలిపియున్నారు. సదరు అగ్రిమెంటు షరతుల ప్రకారం మా క్లయింట్లు పై వారి వద్దనుండి విక్రయ దస్తావేజు పొందుటకు సిద్ధంగా ఉండియున్నారు. కనుక క్రింది షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని, హక్కులుగాని, తాకట్లుగాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన పదిహేను (15) రోజులు లోపల వ్రాతపూర్వకమైన ఆధారములతో క్రింది అడ్రసుకు తెలియపరచవలెను. లేనియెడల సదరాస్తి నిర్వివాదమైన ఆస్తియని ధృవపరచుకొని మా క్లయింట్లు వారి పేరుతో గాని, వారి స్థానీయుల పేరుతో గాని విక్రయపత్రం పొందగలరు. దరిమిలా సదరాస్తిపై ఎటువంటి ఆక్షేపణలు వచ్చిన యెడల అట్టివి చెల్లనేరవు మరియు మా క్లయింట్లు హక్కులను బద్ధపరచజాలవు అని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : - ప్రకాశంజిల్లా - ఒంగోలు స.రి. యిలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, కొత్తపట్నం రోడ్డుకు దక్షిణశ్రేణి - ఒంగోలు పట్టణం, 5వ వార్డు, 11వ బ్లాకు టి.యస్. నెం. 683రులో 3189 చ.అడుగులు మరియు టి.యస్. నెం. 684రులో 861 చ. అడుగులు మొత్తం 4050 చ. అడుగుల ఆస్తికి హద్దులు : **తూర్పు :** ఉమ్మడి రహదారి స్థలముకు పడమరగా వున్న యితరుల తాలుకు ఆస్తి గోడ కొంతవరకు షేక్ గాలిబ్ బి గారి స్వంత ప్రహరీగోడ - ఉత్తర 60 అ.లు.; **దక్షిణం :** షేక్ గాలిబ్ బి గారి పెంకుటిల్లు చూరు నీరు పడే హక్కు గల వారి స్వంత గోడ 15 అ.లు తిరిగి వారి స్వంత గోడ 31 అ.ల 6 అం.లు తిరిగి దక్షిణం యితరుల ఆస్తి తాలుకు స్వంత గోడ - యారిశ 25 అ.లు 2 అం.లు.; **పడమర :** ధారా నరసింహాశాస్త్రి గారి స్థలము వెంబడి ఈ యింటి గోడ 27 అ.లు తిరిగి దక్షిణం డిటో వారి స్థలము వెంబడి యితరుల ఆస్తి తాలుకు కుని గోడ 5 అ.ల 6 అం.లు తిరిగి పడమర ధారా నరసింహ శాస్త్రి గారి స్థలము వెంబడి యితరుల ఆస్తి తాలుకు గోడ 57 అ.లు 3 అం.లు.; **ఉత్తరం :** ధారా నరసింహాశాస్త్రి గారి స్వంత గోడ 40 అ.లు తిరిగి పడమర యితరుల తాలుకు కుని గోడ 7 అ.లు తిరిగి ఈ ఆస్తి తాలుకు యింటిగోడ - యారిశ 17 అ.లు.

స్థలం : ఒంగోలు
తేది: 04.01.2025

బొడ్డు రామలింగం, AP/1697-A/1992, బోడపాటి శ్రీనివాసరావు
అడ్వకేట్స్ డోరు నెం.8-513/81 బృందావన్ నగర్,
శ్రీ సాయి ఎన్క్లేవ్ ఒంగోలు. ఫోన్ : 98665 88599